ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
బుధవారం 27 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.35 గం.
సహర్ : గురువారం ఉ : 4.51 గం.



ఓటరూ.. మేలుకో

- ఓటు నమోదుకు మరో అవకాశం
- ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- 15వ తేదీ వరకు దరఖాస్తు గడువు
- జిల్లాలో 7.48 లక్షల మంది ఓటర్లు
- పెరిగిన ఓటర్లు.. అతివలే నిర్ణేతలు
- హోం బ్యాలెట్‌కు అవకాశం

జఫర్‌గఢ్, మార్చి 26: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. సరైన ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు సామాన్యుడి చేతిలో ఉన్న అస్త్రం ఇది. పారదర్శకంగా వినియోగించుకుంటే బంగారు భవితకు బాటలు వేస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. ఎన్నికల కమిషన్ వివిధ దశల్లో ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తోంది. కొత్త ఓటరు నమోదుతో సహా.. మార్పులు, చేర్పులు, సవరణలకు ప్రత్యేక శిబిరాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. రాబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మరోసారి ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం ప్రస్తుతం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7,48,555 మంది ఓటర్లు ఉన్నారు.

దరఖాస్తు ఇలా...

రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికలు మే 13న జరగనుండగా ఏప్రిల్ 15 వరకు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. జాబితాలో ఓటు ఉందో లేదో పరిశీలించుకుని లేకుంటే నమోదు చేసుకోవాలని సూచించింది. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని స్పష్టం చేసింది. దీంతో ఆయా సెగ్మెంట్లలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం -6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హతను పరిశీలించి అధికారులు ఓటేసే హక్కును కల్పిస్తారు. దీంతో పాటు చిరునామాను మార్చుకోవాలన్నా ఇంకా అవకాశం ఉంది. దానికి ఫారం-8 వినియోగించాలి. అర్హులైన వారు కొత్తగా ఓటు హక్కు, మార్పులు, చేర్పుల కోసం ఆన్‌లైన్‌లో లేదా బీఎల్‌ఓ, తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:// ఎన్‌వీఎస్‌పీ.ఇన్, హెచ్‌టీటీపీఎస్:// సీఈఓతెలంగాణ.ఎన్‌ఐసీ.ఇన్, హెచ్‌టీటీపీఎస్://వీఓటీఇఆర్‌ఎస్.ఇన్. ఈసీఐ.జీఓవీ.ఇన్ లో గానీ లేదా స్మార్ట్‌ఫోన్‌లో ఓటరు హెల్ప్ యాప్ వెబ్‌సైట్ ద్వారా ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు.

వృద్ధులు, దివ్యాంగులకు హోం బ్యాలెట్...


ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని స్థితిలో ఉండే వృద్ధులు, 40 శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. అయితే వృద్ధులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు గతంలో ఉన్న 80 ఏళ్ల వయసు పరిమితిని 85 ఏళ్లకు పెంచింది. ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకు గాను ఫారం -12డి ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అధికారుల అనుమతి అనంతరం ప్రత్యేకంగా నియమించబడిన ఎన్నికల బృందం తమకు కేటాయించిన తేదీల్లో ఆయా సెక్టార్ల పరిధిలోని ఓటర్ల ఇంటికి వెళ్లి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటు వేయిస్తారు.

అతివలే నిర్ణేతలు ...

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల భవిష్యత్తును నిర్ణయించేది మహిళా ఓటర్లే అని గణాంకాలను చూస్తే స్పష్టమవుతోంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో 3,69,844 మంది పురుషులు ఉండగా, 3,78,688 మంది మహిళలు ఉన్నారు. అంటే పురుషుల కన్నా మహిళా ఓటర్లు 8,844 మంది అధికంగా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళల నిర్ణయమే కీలకం కానుంది.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- డీఎస్ వెంకన్న, ఆర్డీవో, స్టేషన్‌ఘన్‌పూర్



ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని అర్హత గల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి. ఏప్రిల్ 1వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన యువతతో పాటు ఓటరు జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వయోజనులు ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్ లేదా నేరుగా బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారం -6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అలాగే 85 ఏళ్లు నిండి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని వారితో పాటు 40శాతం పైగా వైకల్యం ఉన్న వారు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. వీరు ఫారం -12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు జాబితా ప్రకారం గుర్తించిన వారికి దరఖాస్తు ఫారాలు అందజేస్తారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం, ఓటర్ల సంఖ్యను పెంచేందుకు చైతన్య కార్యక్రమాలను చేపడుతున్నాం. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి.

జిల్లాలో మొత్తం 7.48 లక్షల మంది ఓటర్లు..

ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 7,48,555 మంది ఓటర్లు ఉన్నారు. జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మూడు నియోజక వర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
జనగామ	277	1,18,929	1,22,207	09	2,41,145
స్టేషన్‌ఘన్‌పూర్	290	1,24,659	1,27,948	01	2,52,608
పాలకుర్తి	294	1,26,256	1,28,533	13	2,54,802
మొత్తం	**861**	**3,69,844**	**3,78,688**	**23**	**7,48,555**



జఫర్‌గఢ్‌లో నిర్వహించిన ఓటరు చైతన్య ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో, తహసిల్దార్, ఇతర సిబ్బంది (ఫైల్)

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- ఆర్డీవో ధరంసోత్ వెంకన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆర్డీవో వెంకన్న హెచ్చరించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్వోలు, సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో రెండు ఓట్లు ఉన్నవారి వివరాలు, మరణించిన వారి వివరాలను గుర్తించాలన్నారు. 85ఏళ్ల వయస్సు నిండిన వారితో పాటు, దివ్యాంగుల నుంచి 12-డి ఫారాలను తీసుకోవాలన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీలు విజయ్‌కుమార్, రాజేష్, సీడీపీవో ఫ్లోరెన్స్, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.

5కే రన్‌ను విజయవంతం చేయాలి

ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా బుధవారం చేపట్టనున్న 5కే రన్‌ను విజయవంతం చేసేలా అధికారులు కృషి చేయాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న సూచించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో 5కే రన్ నిర్వహణ పై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం ఉదయం 6గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద 5కే రన్ ప్రారంభమవుతుందని, సుమారు 400 మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఇందులో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ముష్క రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగరాజు, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, డీటీలు విజయ్‌కుమార్, రాజేష్, ప్రిన్సిపాల్స్ పోచయ్య, కాళహస్తి పాల్గొన్నారు.

ముగిసిన తిరుమలనాథుని బ్రహ్మోత్సవాలు

భక్తిశ్రద్ధలతో శత ఘుటాభిషేకం, చక్ర స్నానం



స్వామివారికి శతఘుటాభిషేకం పూజలు చేస్తున్న పండితులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 26: స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్ వెనక ఉన్న పురాతన శ్రీ తిరుమలనాథస్వామి వారి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. 10వ రోజు ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి బలి హరణం, లక్ష్మీ నారాయణ యాగం, లక్ష్మీ అమ్మ వారికి 108 కలశాలతో శత ఘుటాభిషేకం, చక్ర స్నానం, పుష్పయాగం, దేవతా విసర్జన, కంకణ ఉద్వాసన నిర్వహించారు. డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, గన్ను శ్రీనివాస్, సునిత, ఎస్.ఆంజనేయులు, యాద శ్రీనివాస్, ఎం.రవీందర్, కొలిపాక సతీష్, కె.వెంకటేశ్వర్లు, నరేందర్, తెల్లాకుల రామకృష్ణ, గౌరిశెట్టి శ్రీనివాస్, వేద పండితులు వరుణ్‌కుమారాచార్యులు, ఎస్.నర్సింహాచార్యులు, మణిదీపాచార్యులు, ఆరుట్ల రఘునాథాచార్యులు, రాము, శేషాచారి, నరేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ కల్చరల్, మార్చి 26: మొదటి విడతగా మండలానికి ఒకటి చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభిస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. మంగళవారం సీఎస్ శాంతికుమారి ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంఆర్ లక్ష్యాలను సాధిస్తామన్నారు. జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనాతో 200 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ముందుగా మండలానికి ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ధాన్యం రాకను బట్టి అవసరానికి తగ్గట్లుగా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. సెంటర్ నిర్వాహకులకు శిక్షణ ఇస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సామగ్రి కొరత లేదన్నారు. తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించామని, బోర్లు, హ్యాండ్ పంప్స్ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, డీఆర్‌డీవో మొగులప్ప, జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ప్రసాద్, డీపీవో రంగాచారి, డీఏవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

జనగామ కల్చరల్, మార్చి 26: గ్రూప్స్, ఎస్ఎస్, ఎస్సీ, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఐ, కానిస్టేబుల్ మొదలైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం టీఎస్ ఎస్సీస్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థుల నుంచి ఈ నెల 28 వరకు జిల్లా కేంద్రం లోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఎస్సీ స్టడీ సర్కిల్) లో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటామని తెలిపారు. అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 98485 03644, 70935 97488 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫిస్ట్‌బాల్ పోటీలో చెన్నూరు క్రీడాకారుల సత్తా



షీల్డ్ అందుకున్న సందీప్, సంతోష్

పాలకుర్తి, మార్చి 26 : ఈ నెల 23 నుంచి 25 వరకు తమిళనాడు రాష్ట్రంలోని కంచిపురంలో జరిగిన జాతీయ స్థాయి 8వ ఫెడరేషన్ కప్ నేషనల్ ఫిస్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలో చెన్నూరు గ్రామానికి చెందిన క్రీడాకారులు బాలబోయిన సందీప్, జోడు సంతోష్ పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రం తరుపున ఫైనల్స్‌లో పాండిచ్చేరి టీంతో తలపడి 10-11, 10-11 స్కోర్‌తో ద్వితీయ స్థానంలో నిలిచారు. రాష్ట్ర ఫిస్ట్‌బాల్ సెక్రటరీ కొమ్ము వెంకట్ సారథ్యంలో వీరు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

కారు అద్దం పగలగొట్టి..

రూ.2 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

జిల్లాకేంద్రంలో పట్టపగలే ఘటన



కారు డోర్ అద్దం పగలగొట్టిన దృశ్యం



బాధితుడు తుమ్మ ప్రతాప్‌రెడ్డి

జనగామ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో ఎప్పటికీ జనసంచారం ఉండే ప్రదేశంలో పట్టపగలు ఆగి ఉన్న కారు అద్దాన్ని పగలగొట్టి దొంగలు రూ.2 లక్షలు ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలం కడవెండికి చెందిన తుమ్మ ప్రతాప్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం జనగామలోని ఐసీఐసీఐ బ్యాంకులో రూ.2 లక్షలు డ్రా చేశారు. అక్కడి నుంచి తన డ్రైవరుతో కలిసి జనగామ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ కారు ఆపి పండ్లు తీసుకుంటుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఇంజిన్‌లో నుంచి ఆయిల్ లీక్ అవుతోందని చెప్పాడు. అయినప్పటికీ పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లి హైదరాబాద్ రోడ్డులోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట కారు నిలిపారు. డ్రా చేసిన డబ్బును కారులోనే ఉంచి డ్రైవర్ సిరినాగుల నవీన్‌తో కలిసి పక్కనే ఉన్న ఐడీబీఐ బ్యాంకులోకి వెళ్లారు. అక్కడ లేట్ అవుతుండడంతో డ్రైవర్‌ను కారువద్దకు పంపించారు. డ్రైవర్ వెళ్లే సరికే దుండగులు అద్దం పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై జనగామ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు నుంచి వెంబడించి..

చోరీ ఘటనలో నిందితులు బాధితుడిని బ్యాంకు నుంచి వెంబడించినట్లు తెలుస్తోంది. రూ. 2 లక్షలు డ్రా చేసినట్లు గమనించి కారుతో పాటే వెంబడించినట్లు సీసీ పుటేజీల ఆధారంగా తెలుస్తోంది. కారును వెంబడించి జనగామ చౌరస్తా వద్దకు రాగానే పక్కా ప్లాన్‌లో భాగంగానే ఇంజిన్ నుంచి ఆయిల్ లీక్ అవుతోందని చెప్పినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అక్కడి నుంచి ఐడీబీఐ బ్యాంకు వరకు వచ్చి బాధితుడు, అతని డ్రైవర్ బ్యాంకు లోపలికి వెళ్లగానే అద్దం పగలగొట్టి సొత్తును దోచుకెళ్లారు. చోరీ చేసిన అనంతరం నిందితులు బైక్‌పై హైదరాబాద్ రోడ్డు వైపు వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా.. సీసీ టీవీ పుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కారును వెంబడించడం, అద్దం పగలగొట్టి చోరీలకు పాల్పడ్డ విధానాన్ని బట్టి ప్రొఫెషనల్ దొంగల పనే అయ్యుంటుందని పోలీసులు భావిస్తున్నారు.

దేవాలయ భూమిపై వ్యాపారుల కన్ను

- రాత్రికి రాత్రే వెలసిన రేకుల ఫెన్సింగ్
- ఆందోళన చేసిన వీహెచ్‌పీఎస్ నాయకులు



ఫెన్సింగ్ వద్ద ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీఎస్, భజరంగ్‌దళ్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి ఆలయ భూమిపై కొందరు వ్యాపారుల కన్ను పడింది. దాన్ని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో సోమవారం రాత్రి రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న విహెచ్‌పీఎస్, బజరంగ్‌దళ్ నాయకులు భూమిని రక్షించాలని కోరుతూ ఫెన్సింగ్ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ భూమిని కొందరు ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువ చేసే దేవాలయ భూమి అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఘన్‌పూర్‌కు చెందిన కొందరు ఫర్టిలైజర్ వ్యాపారులు కుమ్మక్కై ఫెన్సింగ్ వేశారని ఆరోపించారు. గతంలో కూడా ఇదే స్థలంలో నిర్మాణాలు చేయాలని చూస్తే అడ్డుకున్నామని గుర్తుచేశారు. అందుకే వ్యాపారులు రాత్రికి రాత్రే రేకులు పాతారని మండిపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి ఫెన్సింగ్‌ను తొలగించాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ముష్క రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ గోనెల రమేష్, కో కన్వీనర్ గుర్రపు అరవింద్, మండల కో కన్వీనర్ నీల అనిల్, గోరక్ష ప్రముఖ్ సందీప్, ఎస్సీ పరిరక్షణ సమితి జిల్లా నాయకుడు ముక్క స్వామి, హిందూవాహిని నాయకులు గాదం రాకేష్, మంగ శ్రీకాంత్, లక్ష్మణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతం!

కనుమరుగవుతున్న సైదవారి కుంట

విలువైన భూమిలో అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని పాలకులు, అధికారులు

కాపాడాలంటున్న గ్రామస్థులు



సైదవారి కుంటలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: కోట్లాది రూపాయల విలువచేసే సైదవారి కుంట శిఖం భూమి రోజురోజుకూ అన్యాక్రాంతం అవుతోంది. డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ అవసరాలకు గుంట భూమి కావాలంటే దొరకని పరిస్థితుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయల విలువైన భూములు కను మరుగవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రియల్టర్లు అధికారులను, నాయకులను మచ్చిగ చేసుకొని భూములను కబ్జా చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుంట వివరాలు..

కాకతీయుల కాలంనాటి గొలుసుకట్టు చెరువుల నిర్మాణంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని సర్వే నెంబరు 627లో 3.01ఎకరాల విస్తీర్ణంతో కుంటను ఏర్పాటు చేశారు. ఘన్‌పూర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వెనుకాల దీన్ని నిర్మించారు. కాలక్రమేనా అది కనిపించకుండా పోతోంది. ఇందులో 31గుంటల భూమి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కింద పోయింది. ఇంకా 2.10 ఎకరాల భూమి ఉండాలి. కాని అందులో రోజురోజుకూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. మరోవైపు కురగాయల మార్కెట్ ఏర్పాటుకు ఈ స్థలాన్ని పరిశీలించారు. కాని అది నేటికీ కార్యారూపం దాల్చలేదు. అదేవిధంగా మండల పశువైద్యశాల భవనాన్ని ఘన్‌పూర్ జీపీ పక్కనుంచి సైదవారి కుంట స్థలంలోకి మార్చేం దుకు ప్రయత్నించారు. కాని ఆచరణ సాధ్యం కాలేదు. ప్రస్తుతం ఉన్న కుంట శిఖం భూమిలో మొక్కుబడిగా తెలంగాణ క్రీడా మైదానం ఏర్పాటు చేశారు.

హద్దులు ఏర్పాటు చేయాలి...

మార్కెట్ ధరల ప్రకారం ఇక్కడ ఒక గుంట స్థలం రూ. 20 నుంచి రూ.30లక్షల విలువ చేస్తోంది. సదరు భూమి అన్యాక్రాంతం కాకుండా సంబంధిత అధికారులు చూడాలని కోట్లాది రూపాయల విలువచేసే భూమిని రక్షించాలని, రెవెన్యూ సిబ్బంది మేలుకొని కుంట హ హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ కట్టడాలను కూల్చిన అధికారులు..

సైదవారి కుంట పరిధిలో కొన్ని నెలల క్రితం కొందరు వ్యక్తులు కుంట భూమిలో నిర్మాణాలు చేపట్టగా సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది వాటిని జేసీబీతో కూల్చివేశారు.

సైదవారి కుంట భూమిని పరిరక్షించాలి...

- తోట రమేష్, సీపీఐ మండల కార్యదర్శి



కోట్లాది రూపాయల విలువచేసే సైదవారి కుంట భూమిని పరిరక్షించాలి. ప్రభుత్వ భూముల్లో ఇల్లులేని పేదలు గుడిసెలు వేసుకొని ఉంటే వెంటనే కాళీ చేయించే అధికారులకు కోట్లాది రూపాయల విలువ చేసే భూమి అన్యాక్రాంతం అవుతుంటే ఏం చేస్తున్నారు.

రెవెన్యూ సిబ్బంది మేలుకోవాలి...

- కొలనుపాక శరత్‌కుమార్, బీజేపీ నాయకుడు



రాజకీయ పలుకబడితో సైదవారి కుంట భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ సిబ్బంది మేలుకోవడం లేదు. ఇప్పటికైనా శిఖం భూమిని కాపాడి హద్దులు ఏర్పాటు చేయాలి. అవసరమైదే ప్రభుత్వ కార్యాలయాల కోసం భూమిని వినియోగించాలి.

వినాయక్‌నగర్‌లో మహిళ అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 26: మతిస్థిమితం లేని మేకల లక్ష్మి(34) అనే మహిళ అదృశ్యం అయిన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్‌పరిధిలోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మి సోమవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ విషయాన్ని కేయూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ ధ్రువీకరించారు. లక్ష్మి మామ మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని తీస్తున్న సిబ్బంది

రెడీమిక్స్ వాహనం బోల్తా

డ్రైవర్‌కు స్వల్పగాయాలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: హనుమకొండ కేయూ రోడ్డులోని ఈదులవాడు బ్రిడ్జి కింద మురుగుకాల్వలో రెడీమిక్స్ వాహనం బోల్తా పడింది. వాహనం నడుపుతున్న డ్రైవర్ బయట దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ బొక్కలగడ్డ నుంచి ఈదులవాగు ఇటీవల వరద నీరు ఉధృతం కావడంతో ఇళ్లలోకి నీరు చేరుకున్నాయి. అధికారులకు ప్రజలు మొరపెట్టుకోవడంతో మురుగు నీటి కాల్వను వెడల్పు చేసే పనిలో పడ్డారు. అంతేకాకుండా ప్రధాన ముగురుకాల్వ పక్కన ఎత్తుగా ప్రహరీని నిర్మిస్తున్నారు. ఈ గోడ నిర్మాణ పనులు చేసేందుకు మంగళవారం కాల్వలోకి టిప్పర్‌లు, లారీలతోపాటు రెడీమిక్స్ వాహనాన్ని కూడా దింపారు. అయితే రెడీమిక్స్‌లో కంకర కలిపి పోస్తుండగా ఎక్కువ బరువును తట్టుకోలేక బురదలో కుంగిపోయి బోల్తా కొట్టింది. ఇది గమనించిన చట్టుపక్కల వాళ్ల కేకలువేశారు. వెంటనే ప్రమాదాన్ని గమనించి డ్రైవర్ వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులు గమనించి ప్రమాదంలో ఎవరూ చిక్కకుండా చొరకవ చూపారు. వెంటనే క్రేన్ సహాయంతో పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని నిలబెట్టారు. ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా, ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

టెట్.. హాట్ గురూ..

- 5 రెట్లు పెరిగిన దరఖాస్తు ఫీజు
- భారీగా పెరిగిన ఫీజుతో బెంబేలెత్తిపోతున్న అభ్యర్థులు
- ఈ సారి టెట్‌లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అవకాశం
- ప్రత్యేక టెట్ నిర్వహించాలని అంటున్న ఇన్‌సర్వీస్ టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 26: టెట్ దరఖాస్తు ఫీజు అభ్యర్థులకు త్రెట్‌గా మారింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉపాధ్యాయ ఉద్యోగార్థులను ఉసూరుమనిపిస్తోంది. గతంతో పోలిస్తే దరఖాస్తు ఫీజును ప్రభుత్వం 5రెట్లు పెంచడంతో దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు. గత ప్రభుత్వం టెట్ ప్రకటనల్లో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు దరఖాస్తు ఫీజులో రాయితీలు ప్రకటిస్తే ఇప్పుడు మాత్రం ప్రభుత్వం మెండిచేయి చూపడంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. భారీగా ఫీజు పెంచడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈసారి టెట్‌లో ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం కల్పించారు. పదోన్నతుల కోసం ప్రభుత్వం ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌లో అర్హత సాధించాలనే నిబంధన పెట్టడంతో వారికి టెట్ తిప్పలు తప్పడం లేదు. అయితే రెగ్యులర్ వారితో కాకుండా పని చేస్తున్న పంతుళ్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెరిగిన దరఖాస్తు ఫీజు


గతంతో పోలిస్తే టెట్ దరఖాస్తు ఫీజును ఈ సారి ప్రభుత్వం 5 రెట్లు పెంచింది. గతంలో దరఖాస్తు ఫీజు రూ.300ఉండగా, రెండు పేపర్లు రాయాలనుకునే అభ్యర్థులు రూ.400 చెల్లించేవారు. అయితే ఇప్పుడు మాత్రం కేవలం దరఖాస్తుకే వెయ్యి రూపాయలతో పాటు అదనంగా పేపర్‌కు మరో వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు ప్రతీ దరఖాస్తులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఇవ్వాల్సిన రాయితీని సైతం ప్రకటించలేదు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు సాధారణ అభ్యర్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు దరఖాస్తులు చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీగా పెంచిన ఫీజులను ప్రభుత్వం తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ ఏడాది ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం

ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత సాధించాలని నిబంధనలను ప్రభుత్వం విధించడంతో వారికి టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. దీంతో టెట్ నోటిఫికేషన్‌లో పనిచేస్తున్న పంతుళ్లకు ఈ సారి టెట్ రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి..

బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారితో తమకు టెట్ రాయడం సాధ్యం కాదని పనిచేస్తున్న పంతుళ్లు చెబుతున్నారు. వారి కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఎడ్, డీఎడ్ విద్యార్థులు టెట్‌ను తేలికగా రాసే వీలుంటుందని, పనిచేస్తున్న పంతుళ్లు వారితో పోటీగా పరీక్ష రాసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కొన్నేళ్ల కిందట ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసి ప్రస్తుతం ప్రభుత్వం బడుల్లో పనిచేస్తున్న పంతుళ్లు ఎలా రాస్తారనే వాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే నిష్ణాతులుగా ఉంటారని అయితే అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుందనే అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు



ఫీజులో రాయితీని ఇవ్వాలి..



వల్లాల ముకుందం, హనుమకొండ, అభ్యర్థి

టెట్ దరఖాస్తు ఫీజులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రాయితీని ప్రకటించాలి. గత టెట్ పరీక్షకు ప్రభుత్వం ఫీజు రాయితీని ప్రకటించింది. ప్రభుత్వం టెట్ ఫీజుకు రాయితీని కల్పించి బలహీన వర్గాల విద్యార్థులు టెట్‌కు దరఖాస్తులు చేసుకునేలా చేయాలి.

ఫీజు తగ్గించాలి..



బి. మమత, టెట్ అభ్యర్థి, హనుమకొండ

టెట్ దరఖాస్తుకు ప్రభుత్వం భారీగా ఫీజులు పెంచింది. నిరుద్యోగులమైన మా దగ్గర వేలకు వేలు దరఖాస్తు ఫీజులు వసూల్ చేయడం సరికాదు. ఉద్యోగాలు రాకే ఇప్పటికే వయస్సు మించి పోతున్నది. ఇప్పుడు అధిక ఫీజులతో దరఖాస్తుకు దూరం చేయొద్దు.

మార్కుల కోసం రాసేవారికి గుదిబండ

చంద్రగిరి సునిల్‌కుమార్, తెలంణాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం



టెట్‌కు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు టెట్ ఫీజుభారంగా మారింది. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కుల కోసం మరోసారి టెట్ రాయాలనకునే అభ్యర్థులకు ఫీజు గుదిబండగా మారింది. ఎస్సీ, ఎస్టీ, వికాలంగులకు ఫీజులో రాయితి కల్పించాలని, ఫీజు తగ్గించాలి.

ఇన్‌సర్వీస్‌కు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

గుర్రపు రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి టెట్ రాయడం ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుంది. ఎప్పుడో చదివిన ఉపాధ్యాయులు ఇప్పుడు పరీక్ష రాయడం ఇబ్బందిగానే ఉంటుంది. అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ఉపాధ్యాయులకు కష్టంగానే ఉంటుంది.

ఎమ్మెల్యే నాయినిని కలిసిన ఐఆర్ఎస్ అధికారి అపూర్వ



కేయూ క్యాంపస్, మార్చి 26: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ ప్రాంతానికి చెందిన మహారాష్ట్ర ఐఆర్ఎస్ అధికారి మంద అపూర్వ మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. కేయూ రిటైర్డు ఎకానమిక్స్ విభాగం ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్ కూతురు అపూర్వ ఐఆర్ఎస్ సాధించడంపై ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నాయిని కలిసిన వారిలో ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్, మంద అభినవ్‌లున్నారు.

ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

వడ్డెపల్లి, మార్చి 26 : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువును ఏప్రిల్ 9 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ : 73309 90322 లో సంప్రదించాలని ఆయన కోరారు.

30న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో మార్చి 30న శనివారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ అకడమిక్ సెనెట్ సభ్యులు, డీన్లు, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు హాజరుకావాలని కోరారు. కాగా, గతంలో మార్చి 28న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం ఉంటుందని ప్రకటించి అనివార్యకారణాల వల్ల 30కి వాయిదా వేశారు.

పలువురికి జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి26: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ 12 మంది వాహనదారులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 10 మందికి జరిమానా విధించారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.14,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో 10 మందికి రూ.8,800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. అదే విధంగా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 10 మంది మైనర్లకు రూ.9,700 జరిమానా విధించామన్నారు.

రాజనీతిశాస్త్ర విభాగాధిపతిగా సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర నూతన ఇన్‌చార్జి విభాగాధిపతిగా కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ సంకినేని వెంకట్‌ను నియామిస్తూ మంగళవారం కేయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సంకినేని వెంకట్ 2004లో రాజనీతిశాస్త్ర విభాగంలో పార్టుటైమ్ అధ్యాపకులు నియమితులయ్యారు. 2009లో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. డాక్టర్ వెంకట్ జాతీయ సదస్సుల్లో 12 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఇప్పటి వరకు రాజనీతిశాస్త్ర విభాగం ఇన్‌చార్జి విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ కె.వీరాస్వామి తప్పుకోవడంతో ఖాళీ ఏర్పడింది. నూతన విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మార్చి 27న రాజనీతిశాస్త్ర విభాగంలో బాధ్యతలు చేపడుతారు. నూతన విభాగాధిపతిగా నియమితులైన డాక్టర్ సంకినేని వెంకట్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకలు అభినందించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట, మార్చి 26: కాజీపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలో మంగళవారం ఉదయం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 55 నుంచి 60 యేళ్లు ఉంటాయని, తెలుపు రంగు, పొడవు ముఖం, తెల్ల గడ్డం, బ్లూ గీతల షర్ట్, వైట్ కలర్ లైనింగ్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు లిఫ్ట్ పక్కనే పడుకుని నిద్రలోనే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి జేబులో కళ్యాణ్ జంక్షన్ నుంచి కాజీపేట అనే రైలు టిక్కెట్ ఉంది. గుర్తించడానికి ఇతరత్రా ఏ ఆధారాలు లేవు. ప్రయాణికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబరు 87126 58609, 99498 59108 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎన్.శ్రీనివాస్ (ఫైల్)

కాజీపేట, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట విష్ణుపురికి చెందిన ఎన్.శ్రీనివాస్ (47) ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న రహ్మత్‌నగర్‌లో రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఎన్.పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాజనీతిశాస్త్రంలో మాధవికి డాక్టరేట్



మాధవి

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయా యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకురాలు కె.మాధవికి డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ డిస్లెస్‌మెంట్: ఏస్టడీ ఆఫ్ ఇరిగేషన్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ జి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో మాధవి డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన మాధవి హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మాధవిని పలువురు అభినందించారు.

చరిత్రవిభాగంలో అనితకు..



ఈ. అనిత

కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకురాలు ఈదులకంటి అనితకు డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్టిస్ట్ మూమెంట్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై కేయూ చరిత్ర విభాగం ప్రొఫెసర్ పి.సదానందం పర్యవేక్షణలో అనిత డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన అనిత హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రవిభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అనితను పలువురు అభినందించారు.

జేఎన్‌యూలో ప్రొఫెసర్ రామేశ్వరం ప్రసంగం

కేయూ క్యాంపస్, మార్చి 26: కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరంనకు అరుదైన అవకాశం లభించింది. 18-20 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో 8వ ప్రపంచ కాన్సర్ కాంగ్రెస్ -2024 కాన్వకేషన్‌లో ప్రసంగించారు. నేచర్ క్యూర్ మెదడ్స్ ఇన్ ది మేనేజ్‌మెంట్ ఆఫ్ కాన్సర్- టూ సెంచరీస్ హిస్టోరికల్ ఎవిడెన్సెస్ ఆఫ్ ది వరల్డ్ అనే అంశంపై విస్తృత కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కేయూ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ప్రసంగం విశేషాలను వీసీ రమేశ్‌తో పంచుకుని తనకిచ్చిన ప్రశంసాపత్రాన్ని ప్రదర్శించారు.



కేసీఆర్ బొకే ఇస్తున్న కావ్య

కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య

రాంనగర్, మార్చి 26: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య టీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కావ్య కలిసి తనపై నమ్మకంతో వరంగల్ బీఆర్ఎస్ టికెట్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని కడియం కావ్యను ఈ సందర్భంగా కేసీఆర్ ఆశీర్వదించారు.

రావు పద్మను కలిసిన ఆరూరి రమేశ్



పద్మకు బొకే ఇస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, మార్చి26: బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను మంగళవారం వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ హంటర్‌రోడ్‌లోని పద్మ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావు పద్మ అమరేందర్‌రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. పద్మ భర్త అమరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కొమ్మాలకు వచ్చిన బీజేపీ నాయకులు

భక్తజన సంద్రంగా కొమ్మాల జాతర

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు ● హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు ● గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్
ఇబ్బందులు పడిన కొమ్మాల జాతర భక్తులు ● లక్షమందికి పైగా దైవదర్శనం చేసుకున్న భక్తులు

గీసుగొండ/దుగ్గొండి, మార్చి 26: వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు రెండోరోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తుల తాకిడితో భక్తజన సంద్రంగా మారింది. దాదాపు లక్షపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో శేషగిరి తెలిపారు. ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో కూడా భక్తుల రద్దీ కనబడింది. వరంగల్ తదితర ప్రాంతాల నుంచి నుంచి ఎడ్ల బండ్లపై వచ్చిన భక్తులు రోడ్ల పక్కనే విడిది చేశారు. వరంగల్ నుంచి జాతర వరకు ఎండ్లబండ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోడ్ ఉన్న నేపథ్యంలో డీసీపీ, ఏసీపీలు రాజకీయ ప్రభలపై విధించినా, రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. ప్రభలకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, సీఎం, ఎమ్మెల్యేల ఫొటో కటౌట్‌లు ఏర్పాటు చేసుకొని డీజేలతో ఆట్టాహాసంగా తరలివచ్చారు. ప్రభల తరలింపులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తింది. పోలీసులు తక్షణమే స్పందించి ఇరుపక్షాలను శాంతింపచేశారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట, సంగెం మండలాలు నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంసీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన రాజకీయ ప్రభలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. ప్రభలకు, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎస్ఐలు పర్యవేక్షించారు.

గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్

రాజకీయ ప్రభబండ్ల భారీగా తరలిరావడంతో దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు జాతరకొచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సోమవారం ప్రారంభం కాగా.. మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, ఎంసీపీఐ(యూ) పార్టీలు పోటాపోటీగా ప్రభబండ్లను రూపొందించాయి. కాంగ్రెస్ ప్రభబండిని నర్సంపేట్ ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి, బీఆర్ఎస్ ప్రభను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. వాటితో పాటు చెన్నారావుపేట, నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ మండలాలకు చెంది న ప్రభబండ్లు కూడా గిర్నిబావి కేంద్రానికి చేరుకొని డప్పుచప్పుళ్లు, డీజే పాటలు, కోలాటం, ఆటపాటలతో ర్యాలీగా జాతరకు తరలాయి. ఈ క్రమంలో గిర్నిబావి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అటు జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడగా.. బీఈడీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లడం కనిపించింది. అలాగే వరంగల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను నాచినపల్లి నుంచి లక్ష్మీపురం, మచ్చాపురానికి మళ్లించారు. డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు రాజగోపాల్, రమణమూర్తి, చంద్రమోహన్‌లతోపాటు సబ్ డివిజన్ ఎస్సైలు జక్కుల పరమేశ్, రఘుపతి, రామారావు, గాదె అరుణ్‌కుమార్‌లతో సీఆర్‌పీ పోలీసులు గిర్నిబావి రహదారికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



జాతరకు వస్తున్న రాజకీయ ప్రభలు

ఎర్రగట్టు జాతరలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్ దంపతులు

హసన్‌పర్తి, మార్చి 26: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి జాతరలో రెండో రోజు మంగళవారం భక్తులు వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారదాచార్యులు, ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఉదయం స్వామివారికి పూజలు, పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చిన్న చక్రముల బండ్లు తిరిగాయి. జాతరలో వెలిసిన దుకాణాల్లో భక్తుల సందడి నెలకొంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. విశ్వక్సేన సేవా సమితి ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, దర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, పెద్దమ్మ సురేష్, జన్ను శైలజ, సంపత్ యాదవ్, విశ్వక్సేన సమితి సభ్యులు పాల్గొన్నారు.



మొండ్రాయి క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీ చేస్తున్న ఏసీపీ నర్సయ్య

వాహనాల తనిఖీ

కొడకండ్ల మార్చి 26 : లోకసభ ఎన్నికల దృష్ట్యా మొండ్రాయి క్రాస్ రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసినట్లు పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో దేవరుప్పుల ఎస్ఐ చెన్నకేశవులు, పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన

కొడకండ్ల మార్చి 26 : మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు నవీన వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎం.గోవర్ధన్ సమగ్ర వ్యవసాయం గురించి వివరించగా, ఎన్.రామ్‌గోపాల్ వర్మ డ్రోన్లతో వ్యవసాయం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పరుశురామ్, ఏఈవోలు ప్రియాంక, సువర్ణ, వెంకటేష్, శ్రీవాణి, సరిత కుమారి, కీర్తి, మహేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన గ్రామస్థులు

పాలకుర్తి, మార్చి 26: నిలువ నీడలేని పేదల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని పరిరక్షించాలని కోరుతూ లక్ష్మీనారాయణపురం గ్రామస్థులు తహసీల్దార్ వెంకటేశంకు మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మల్యాల పర్శరాములు, గిలకత్తుల అశోక్, మజ్జిగ కుమారస్వామి, చీటూరి చంద్రయ్య మాట్లాడుతూ 2006-07లో అప్పటి ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు నిలువ నీడలేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు గ్రామానికి చెందిన కోరుకొండ దేవరాజ భగవాన్ బట్టార్ వద్ద సర్వేనెంబర్ 39,41లో 3 ఎకరాల 30 గుంటల భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వం పట్టాలు సైతం పంపిణీ చేసిందని తెలిపారు. అందులో మిగిలిన భూమిలో కమ్యూనిటీ హాలు, పార్కు, నిర్మాణం కోసం, పోచమ్మ దేవాలయానికి భూమిని కేటాయించినట్లు పేర్కొన్నారు. అయితే దేవరాజ భగవాన్ బట్టార్ కుమారుడు నర్సింహ బట్టార్ ఆ భూమిలో వేసిన కంచెను తొలగించి విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నాడని, ఆ భూమిని పరిరక్షించాలని కోరారు.

ధర్మకర్తపై ఎస్సీఎస్టీ కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: డివిజన్ కేంద్రంలోని తిరుమలనాథ స్వామి ఆలయ ధర్మకర్త కలకోట రంగాచార్యులపై ఎస్సీఎస్టీ కేసు నమోదైనట్లు సీఐ ముస్కు రాజు మంగళవారం రాత్రి తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని తిరుమలనాథస్వామి ఆలయ భూమిలో కొందరు వ్యక్తులు మంగళవారం ఫెన్సింగ్ వేశారు. విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్, వీహెచ్‌పీఎస్ నాయకులు అక్కడ నిరసన తెలపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముక్కస్వామి పాల్గొన్నారు. తన స్థలం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలుసుకున్న రంగచార్యులు అక్కడకు చేరుకొని ముక్కస్వామిని టార్గెట్ చేస్తూ అకారణంగా కులం పేరుతో దూషించాడని, ఎస్సీ కులానికి చెందిన నీకు దేవస్థానం భూమితో ఏమి సంబంధం అంటూ అవమానకరంగా మాట్లాడాడని ముక్కస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా రమేశ్

లింగాలఘణపురం, మార్చి26: లింగాలఘణపురం మండల కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడఇగా పటేల్‌గూడెం గ్రామానికి చెందిన బండ రమేశ్‌ను నియమిస్తూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బిట్ల ఉప్పలయ్యను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా రమేశ్‌కురుమ మట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇందిర, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లొక్కుంట్ల ప్రవీణ్, యూత్‌కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి దిలీప్ రెడ్డి, మండల అధ్యక్షులు కొల్లూరు శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 99.90% విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 26: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఫిజిక్స్ పరీక్ష నిర్వహించారు. 6698 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరు కాగా 6691 మందితో 99.90 శాతం విద్యార్థులు హాజరయ్యారు. కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో 6 పరీక్షా కేంద్రాలను డీఈవో కె.రాము సందర్శించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 8 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

సుందరీకరించండి!

- దంపింగ్ యార్డును తలపిస్తున్న దేవాదుల రిజర్వాయర్
- కట్టపై దట్టంగా పెరిగిన తుమ్మ చెట్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన రోడ్డు
- జంతు కళేబరాలతో కంపుకొడుతున్న పరిసరాలు
- పర్యాటకంగా తీర్చిదిద్దాలంటున్న ప్రజలు



ఘన్‌పూర్ రిజర్వాయర్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన స్టేషన్‌ఘన్‌పూర్ దేవాదుల రిజర్వాయర్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కట్టపైన దట్టమైన సర్కారు తుమ్మచెట్లు పెరగడంతో ప్రమాదకరంగా తయారైంది. 2004లో ప్రారంభమైన దేవాదుల రిజర్వాయర్ పనులు 2009లో పూర్తయ్యాయి. రిజర్వాయర్ వినియోగంలోకి వచ్చి 15 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు దాని భద్రత గురించి పట్టించుకున్నవారు లేరు. దీంతో చెట్ల వేళ్లు కట్టలోకి చొచ్చుకొని పోయి పలు చోట్ల కట్టపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. కట్ట లీకేజీ అయ్యే ప్రమాదం ఉందని రైతులు, మత్స్యకారులు వాపోతున్నారు. గత ఐదేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండంతో రిజర్వాయర్ నీటి నిల్వలు 1.57 టీఎంసీకి వరకు చేరుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని రైతులు భయాందోళన చెందుతున్నారు. గత పాలకులు పట్టించుకోలేదని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కట్టపై మందు పార్టీలు..

కట్ట పైన భారీగా చెట్లు పెరుగడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రతీ రోజు వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు బైకులు, కార్లలో వచ్చి అసాంఘిక కార్యాకలపాలకు పాల్పడుతున్నారు. ఆటు వైపు వెళ్లే వారు లేకపోవడంతో రెచ్చిపోతున్నారు. మందు పార్టీలు చేసుకుంటూ, బాటిళ్లను పగులగొట్టి నీళ్లలో పడేవేస్తూ నానా హంగామా సృష్టిస్తున్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

పర్యాటక కేంద్రం అయ్యేనా...

దేవాదుల రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా మార్చుతామని గత ప్రభుత్వంలో నేతలు అనేక మార్లు హమీలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంగా మారడమే కాకుండా రైల్వే స్టేషన్, బస్టేషన్‌లు ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉన్నందున రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరుతున్నారు. రిజర్వాయర్‌లో బోటింగ్ సిస్టమ్ అమలు చేస్తే పర్యాటకుల తాకిడి పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

చెట్లు తొలగిస్తే వాకర్స్‌కు మేలు...

రిజర్వాయర్ నిర్మాణం పూర్తైన మొదట్లో ఘన్‌పూర్, ఛాగల్, ఇందిరానగర్, కొత్తపల్లి, శివునిపల్లి గ్రామాలకు చెందిన మందల మంది కట్టపైకి వచ్చి వాకింగ్ చేసేవారు. పోలీస్, ఎస్సై, రైల్వే గ్రూపు ఉద్యోగాలకు ప్రిపేరయ్యే వారు కట్టపైన రన్నింగ్ సాధన చేసే వారు. ఇపుడు నడిచే పరిస్థితి లేదు. కట్టపై చెట్లు పెరుగడంతో ఇబ్బంది అవుతోంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కట్టపైన పెరిగిన చెట్లను తొలగించి చదును చేస్తే క్రీడాకారులకు, వాకర్స్‌కు ఉపయోగంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



రిజర్వాయర్ కట్ట పై దట్టంగా పెరిగిన చెట్లు



చెట్లు పెరగడంతో ఇరుకుగా మారిన దారి



కట్టపైన పడవేసిన వ్యర్థాలు

మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు..

వెంకన్న, మత్స్య సంఘం నాయకుడు



ప్రతీ నిత్యం రిజర్వాయర్ కట్ట పై మందుబాబులు మద్యం బాటిళ్లను పగులగొట్టి నీళ్లలో విసిరి వేయడంతో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. పోలీస్ సిబ్బంది స్పందించి కట్ట పైన మందుబాబుల హంగామాలను నిలువరించాలన్నారు.

తుమ్మచెట్లను తొలగించాలి..

మునిగెల రమేష్, సీపీఎం నాయకుడు



కట్ట పైన దట్టంగా పెరిగిన సర్కారు తుమ్మ చెట్లను తొలగించి కట్టను రక్షించాలి. రిజర్వాయర్‌లో బోటింగ్ ఏర్పాటు చేసినట్లైతే పర్యాటకుల తాకిడి పెరిగి మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

కట్టను చదును చేయాలి..

పెసరు సారయ్య, క్రీడాకారుడు



కట్ట పైన పెరిగిన చెట్లను తొలగించి చదును చేస్తే పోలీస్, ఎస్సై ఉద్యోగాలకు సన్నద్ధమయే యువకులకు దేహదారుడ్య పరీక్షలకు తర్ఫీదు తీసుకోవడానికి మేలుగా ఉంటుంది. ప్రతీ నిత్యం వందలాది మార్నింగ్ వాకర్స్‌కు మేలుగా ఉంటుంది.

హోం బ్యాలెట్ దరఖాస్తులను అందించాలి

- బీఎల్‌వోలకు తహసీల్దార్ సూచన



మాట్లాడుతున్న తహసిల్దార్ ఆంజనేయులు

జఫర్‌గడ్, మార్చి 26: పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు హోం బ్యాలట్ దరఖాస్తులను అందించాలని మండల తహసిల్దార్ అంబటి ఆంజనేయులు బీఎల్ ఓలు, సూపర్‌వైజర్‌లకు సూచించారు. హోం బ్యాలట్ విధానం, అమలుపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ఎన్నికల సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రాలకు వెళ్లలేని 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం వైకల్యం గల దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో వయో వృద్ధులు 322, దివ్యాంగులు 600 మంది చొప్పున మొత్తం 922 మంది ఉన్నారన్నారు. బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లు వారి ఇళ్లకు వెళ్లి హోం బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఫారం -12డీ ఫారాలను అందించాలన్నారు. అనంతరం ఎన్నికల సంఘం నుండి అనుమతి వచ్చిన తరువాత దరఖాస్తు దారులకు హోం బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారన్నారు.

ఎన్నికల విధులను ఉద్యోగ సిబ్బంది బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎంఆర్ఐ అనిల్‌కుమార్, ఆయా గ్రామాల బీఎల్ ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ ఫలాలు

టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర



ఇందిర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 26: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో తాటికొండ గ్రామానికి చెందిన 30మంది బీఆర్‌ఎస్ నాయకులు ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అరునూరైనా ఆరుగ్యారంటీలను అమలు చేసి తీరుతాడని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగరబోయిన శ్రీరాములు, బలిజ రాజు, సునీల్, పాలకుర్తి నాగరాజుగౌడ్, దామెర శ్రీను, బొల్లం నాగరాజు, మోసిన్‌అలీ, షహిద్, అమీర్, అరాఫత్, తిరుమలేష్, రేయ్యల రాజు, గుర్రం రాజు, జక్కుల శివ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా అశోక్

రఘునాథపల్లి, మార్చి 26: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా జాఫరగూడెం గ్రామానికి చెందిన కర్ని అశోక్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహావిష్కరణ



ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామస్థులు

చిలుపూర్, మార్చి 26: చిలుపూర్ గుట్టలో పుట్టల ఎల్లమ్మ విగ్రహాన్ని మంగళవారం ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవాల్లో భాగంగా ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గౌడసంఘం అధ్యక్షుడు మాచెర్ల శ్రీనివాస్, రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మోడెం విజయభాస్కర్ హాజరయ్యారు. బుగులు వెంకన్న ఆలయ ప్రధాన పూజారి బ్రాహ్మణపల్లి రవిందర్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. విగ్రహ దాతలు నారగోని రవిచంద్ర - గాయత్రి, మాచెర్ల సతీష్‌కుమార్ - చందన కుటుంబ సభ్యులతో పాటు, గౌడసంఘం ప్రతినిధుల సమక్షంలో పుట్టల ఎల్లమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ విజయభాస్కర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా విగ్రహాలు, పుట్టను ఏర్పాటు చేయడం కోసం దాతలు రూ 50 వేల విరాళం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం డప్పుచప్పుళ్ళు, బాజా భజంత్రీల మధ్య అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో నారగోని క్రాంతిసాగర్ - మౌనిక, మాచెర్ల ప్రవీన్, నారగోని రాజు, నారగోని శ్రీనివాస్, కుర్ర భాస్కర్, నారగోని రాములు, నంగునూరి రాజు, పంతం రాజు, నారగోని పరమేశ్, గనగోని వెంకటేశ్వర్లు, సట్ల లింగయ్య, నారగోని వెంకన్న, మాచెర్ల స్వామి, తాళ్ళపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్యామల కుటుంబ సభ్యులకు బాండ్ పత్రాలను అందిస్తున్న గ్రామస్థులు

బాధిత కుటుంబానికి గ్రామస్థుల చేయూత

పాలకుర్తి, మార్చి 26: మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన పసుల శ్యామల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గ్రామస్థులు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. కడుపేదరికంలో ఉన్న కుటుంబానికి సాయం చేయాలని భావించిన కానిస్టేబుల్ అశోక్ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. అందరూ స్పందించి రూ.40,131 వేలు జమ చేసి శ్యామల కూతురు జాన్విక పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. సదరు పత్రాలను మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు అందచేశారు. కాగా, శ్యామలకు భర్త రమేష్, కూతురు జాన్విక, కుమారుడు శివ ఉన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కొడకండ్ల మార్చి 26: మండలంలోని రామన్నగూడెం శివారులో పేకాటశిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. బోళ్ళ రమేష్ , మల్లయ్య, నారగాని సోమయ్య, కన్నెబోయిన రామ్మూర్తి, కుమార్, ఉస్మాన్, వేము వీరస్వామి, సోమయ్య, అజర్‌లు పేకాడుతుండగా పట్టుకున్నామని, వారిలో ఐదుగురు పారిపోగా నలుగురిని బోళ్ళ రమేశ్, నారగాని సోమయ్య, వేము వీరస్వామి, కన్నెబోయిన రామ్మూర్తిలను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద రూ.5750 నగదు, 5 మొబైల్‌ఫోన్లు, బైక్‌లను జప్తు చేశామన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



మణి కుమార్ (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, మార్చి 26: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల కేం ద్రంలోని ఐదో వార్డుకు చెందిన కుమ్మరి మణి కుమా ర్(22) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన కొండాయి సంధ్యను వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా భార్యా భర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 23న భార్య తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో మద్యం సేవించిన మణి కుమార్ ఆ మత్తులోనే పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరిన మణి కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ములుగు, మా ర్చి 26: రోడ్డు ప్రమాదంలో యు వకుడి మృతి చెంది న సంఘటన ములుగు పోలీ స్‌స్టేషన్ పరిధి జవహర్‌నగర్ సమీ పంలో జాతీయ రహదారిపై సోమ వారం రాత్రి చోటు చేసుకుంది.ఎస్సై వెంకటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పొడెం రఘు(30) పెయిం టర్‌గా పనిచేస్తున్నాడు. తన మిత్రులతో కలిసి పదిరోజుల క్రితం ములు గుకు పెయింటింగ్ పని నిమిత్తం వచ్చాడు. సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

కొడకండ్ల మార్చి 26 : మండలంలోని గుమ్మడి బండ తండా పరిధిలోని దేవుని చెరువులో మంగళవారం అనుమతి లేకుండా ట్రాక్టర్లలో మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు. నిందితులు సోమన్న, జాటోత్ కోటి, భానుచందర్‌లపై కేసు నమోదు చేసి జేసీబీ, 2 ట్రాక్టర్లను జప్తు చేసినట్లు వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

జనగామ కల్చరల్, మార్చి 26: మండలంలోని శామిర్‌పేటలో బైక్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. జనగామ మండలం శామిర్‌పేట గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య(60) సోమవారం రాత్రి శామిర్‌పేటలో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కొమురయ్యను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బైక్ నడుపుతున్న వ్యక్తిని పసరమడ్ల గ్రామానికి చెందిన రాగుల ప్రశాంత్‌గా గుర్తించారు. కొమురయ్య కుమార్తె జిట్టి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



బక్కయ్య గౌడ్ ఫైల్

తరిగొప్పుల, మార్చి 26: మండలకేంద్రంలో తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్ల పల్లి బక్కయ్య గౌడ్(52) మంగళవారం ఉదయం కల్లు తీయడానికి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులకు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మధ్యలోనే చనిపోయాడు. ఆయనకు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఎస్సై శ్వేత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను కోటీశ్వరులు చేస్తాం..

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి..
- రాహుల్‌ను ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలి
- పదేళ్లలో రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, మార్చి 26: మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వడ్డీలేని రుణాలతోపాటు ప్రతి ఆడబిడ్డకూ రూ.10లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో మంత్రి సీతక్క మంగళవారం పర్యటించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకట కృష్ణ అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సీతక్కతోపాటు కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని బీజేపీ అండతో పదేళ్లుగా బీఆర్‌ఎస్ దోపిడీ చేసిందని ఆరోపించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఈరెండు పార్టీలకు ప్రజలకు గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం అరు గ్యారెంటీల పథకాలను ఆచరణలో పెట్టామని తెలిపారు. 200 యూ నిట్లలోపు ఉచిత విద్యుత్, మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10ల క్షలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పెంపు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను అమలులోకి తెచ్చామన్నారు. పేదలు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ మోదీ ప్రభుత్వం విస్మ రించిందని విమర్శించారు. మద్దతు ధర కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిరసన తెలిపితే వారి పై తుపాకులు ప్రయోగించారని ధ్వజమెత్తారు. 2022 వరకు దేశంలో ఉన్న ప్రతి పేద కుటుంబానికీ ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పిన బీజేపీ మాటతప్పిందని దుయ్యబట్టారు. తెలం గాణ మాదిరిగానే కేంద్రంలో కూడా ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని, రాబోయేది కాంగ్రెస్ సర్కారేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ భారీ మెజారిటీతో కైవసం చేసుకోవాల న్నారు. ఇటీవల కొందరు తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజల అండ ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. బల రాంనాయక్ మాట్లాడుతూ గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన తాను ములుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేశాన న్నారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రోడ్లు, వంతెనల నిర్మాణం చేసినట్లు చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నిక ల్లో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల ఆశోక్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రవిచందర్ పాల్గొన్నారు.